క్లుప్తంగా

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



కంకిపాడు: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ అన్నపురెడ్డి కోటి రెడ్డి సూచించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యాన కంకిపాడులోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం విద్య, క్రమశిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో కూడిన విద్యనభ్యసించాలని, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించడం ద్వారానే వారి ఉజ్వల భవితకు మార్గం సుగమం అవుతుందన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్‌పర్సన్ బండి జ్యోతి, ఉపాధ్యాయులు, లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని ఉయ్యూరు సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి బి. మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అర్హులైన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీన నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షల్లో మెరిట్ అభ్యర్థులను అర్హత ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పెషల్ డీఈడీ కళాశాలలో అధికారుల విచారణ

గన్నవరం: స్థానిక మర్లపాలెం రోడ్డులోని ప్రత్యేక డీఈడీ కళాశాలలో శనివారం గుడివాడ డివిజనల్ విద్యాశాఖ అధికారి ఐ. పద్మారాణి నేతృత్వంలోని కమిటీ విచారణ జరిపింది. జిల్లా విద్యాశాఖ అధికారి తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు ఈ కమిటీ సభ్యులు కళాశాల అనుమతి పత్రాలు, విద్యార్థుల హాజరు, కళాశాల రికార్డులను పరిశీలించారు. కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో డీవైఈఓ మాట్లాడి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా పద్మారాణి మాట్లాడుతూ.. కళాశాల అనుమతుల విషయమై డీఈఓకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి వివరాలు సేకరించడంతోపాటు పూర్తిస్థాయిలో కళాశాల రికార్డులను పరిశీలించినట్లు చెప్పారు. విచారణకు సంబంధించి నివేదికను డీఈఓకు అందజేయనున్నట్లు తెలిపారు. కమిటీలో సభ్యులుగా ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మి, పామర్రు ఎంఈఓ పద్మావాణి పాల్గొన్నారు.

500 మందికి వైద్య పరీక్షలు



ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో ఎముకలు, కీళ్లు, నరాలు, కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ బి. ప్రసాదరెడ్డి, రుమటాలజిస్ట్ డాక్టర్ మమత, సాధారణ వ్యాధుల నిపుణుడు సతీష్ చంద్ర, శ్వాసకోశ నిపుణుడు కార్తీక్, న్యూరాలజిస్ట్ హరిణి, ఎముకల నిపుణుడు చేతన్, కంటి వైద్యుడు రహమాన్, దంత వైద్యుడు వెన్నెల కృష్ణదివ్య పాల్గొన్నారు.

మండల సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులు

విజయవాడరూరల్: మండల పరిషత్ సమావేశానికి పలు శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరవుతూ విలువలను దిగజార్చుతున్నారు. శుక్రవారం ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి పట్టుమని పదిమంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. ముఖ్యమైన నీటిపారుదల శాఖ (మైనర్, మేజర్) ఇటీవల సంభవించిన వరదల్లో ఇరిగేషన్‌కు సంబంధించిన అనేక చెరువులు, కాల్వలకు గండ్లు పడటం జరిగింది. వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సి ఉండగా సమావేశానికి అధికారులు గైర్హాజరవడంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా వరదల్లో రోడ్లు గండ్లు పడి రోజుల తరబడి రాకపోకలకు అంతరాయ కల్గించిన అంశంపై సమావేశంలో చర్చించేందుకు ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. అలాగే ప్రజా ఆరోగ్యానికి సంబంధించి మండలానికి అయిదుగురు మండల స్థాయి వైద్యాధికారులుండగా ఒక్కరు మాత్రమే హాజరయ్యారు. ఎక్సైజ్, కోఆపరేటివ్, మార్కెటింగ్, పౌరసరఫరాలు, విద్యుత్ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశాలకు రాలేని వారు తగిన కారణం చూపుతూ సంబంధిత మండల అధికారులకు సమాచారం పంపాల్సి ఉండగా అలాంటిది జరగడంలేదు.

ప్రభుత్వ స్థలం.. దోచెయ్

- వైకుంఠపురంలో రూ. అరకోటి విలువైన స్థలం
- మితిమీరుతున్న తమ్ముళ్ల ఆగడాలు
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



గోసాల వైకుంఠపురంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు తెరకట్టిన ఆక్రమణదారులు

పెనమలూరు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోసాల వైకుంఠపురంలో ప్రభుత్వ స్థలాలను గజాల చొప్పున అమ్ముకుంటున్నారు. అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాలు మాయమైపోతున్నా అధికారుల్లో కనీస స్పందన కనబడటం లేదు. దీంతో ఆక్రమణదారులు అడుగు ముందుకేసి కబ్జాల పరంపరలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. గోసాల వైకుంఠపురంలో నీటిపారుదల శాఖకు చెందిన బందరు కాలువ కట్టపై అత్యంత విలువైన స్థలం ఉంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పచ్చనేతల కళ్లు ప్రభుత్వ స్థలంపై పడ్డాయి. దీంతో స్కెచ్ వేసి దశలవారిగా అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తున్నారు. కబ్జా చేసిన స్థలాలను బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటూ కాసులు కూడపెడుతున్నారు.

ఆక్రమణలు–రియల్‌దందా

గోసాల వైకుంఠపురంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలుత వంతెన వద్ద రహదారిని ఆక్రమించి బడ్డీ కొట్లు పెట్టారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో కొంతకాలం మౌనంగా ఉండి ఆక్రమణలు చేశారు. ఆ తర్వాత కాలువ కట్టపై ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. బహిరంగ మార్కెట్‌లో స్థలాలు విక్రయించి ఇళ్ల నిర్మాణం చేశారు. దీనిపై కూడా వార్తలు రావడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కట్టడాలను ఆపినట్లు హడావుడి చేసి వదిలేశారు. దీంతో ఆక్రమణదారులు నిర్మాణాలు పూర్తి చేశారు. ఇప్పుడు తాజాగా దాదాపు 15 సెంట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణపై టీడీపీ నేతలు స్కెచ్ వేశారు. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ. అరకోటి ఉంటుంది. ఇప్పటివరకు దీనిపై అధికారులు స్పందించలేదు. దీంతో త్వరలో ఇక్కడ ప్రభుత్వ భూమి కబ్జా చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

అధికారుల పాత్ర ఏమిటి?

ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్నా స్పందించని అధికారులు పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఆక్రమణదారుల వద్ద అధికారులు ముడుపులు తీసుకుంటున్నారా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితితులు ఇలాగే ఉంటే వైకుంఠపురంలో ఇక ప్రభుత్వ భూమి అంగుళం కూడా మిగిలేటట్లు లేదు.

రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్టు ప్రదేశం పరిశీలన



ముస్తాబాదలో ఆర్‌ఓఆర్ ప్రాజెక్టు మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో నిర్మిస్తున్న రైల్ ఓవర్ రైల్(ఆర్ఓఆర్) ప్రాంతాన్ని శనివారం గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం పరిశీలించారు. రైల్వే అధికారులు నిర్మిస్తున్న ఆర్వోఆర్‌తో సమస్యలు తలెత్తాయని ఇటీవల రైతులు ఆ పనులను అడ్డుకుంటూ ఆందోళన నిర్వహించారు. దీంతో రైల్వే ఈఈ అవోక్‌కుమార్‌తో కలిసి ఆర్డీవో పరిశీలించారు. రైల్వే శాఖ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులు ఆర్డీవో ఎదుట తమ గోడు వినిపించారు. డ్రెయినేజీ, రోడ్డు లేకపోతే తీవ్రంగా ఇబ్బందులు పడతామని చెప్పారు. ఎగువ నుంచి వచ్చే నీరు కిందకు వెళ్లే పరిస్థితి లేదని వాపోయారు. ఇటీవల వర్షాలకు వందలాది ఎకరాల పంట నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోకి సైతం నీరు వచ్చే ప్రమాదం ఉందన్నారు. రైల్వే అధికారులు డ్రెయినేజీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని, మెయింటెన్ చేయడం లేదని, రైతులు చేస్తుంటే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆర్డీవోకు వివరించారు. ఆర్వోఆర్‌కు భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని రైతు పొలడుగు సాంబశివరావు ఆవేదన వెలిబుచ్చారు. రైతుల సమస్యలను విన్న ఆర్డీవో ఇరిగేషన్ అధికారులకు లెటర్ పంపి గడచిన 20ఏళ్లుగా ఎగువ నుంచి వచ్చే వాటర్ పరిస్థితి, డ్రెయినేజీ ఎన్ని అడుగులు నిర్మించాలో తదితర విషయాలపై నివేదిక అడుగుతామన్నారు. రైల్వే లైన్ల మధ్య మిగిలిన భూమిని రైల్వే శాఖ తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. తహసీల్దార్ వెంకటశివయ్య, సర్వేయర్ మాధవరావు, రైతులు పేదర్ల వెంకటేశ్వరరావు, పొలడుగు మల్లికార్జునరావు, గుంటూరు ప్రసాద్, కడియాల కృష్ణారావు, పొలడుగు రత్నారావు, శేషగిరిరావు, గుంటూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పల్లె పండగ కార్యక్రమాలు

గన్నవరం: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఆదివారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి. స్వర్ణలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి తెంపల్లి, వీరపనేనిగూడెం, కొత్తగూడెం, గొల్లనపల్లి, మాదలవారిగూడెం, సూరంపల్లి, ముస్తాబాద గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి పురుషోత్తపట్నం, కేసరపల్లి శివారు వీఎన్. పురం, గన్నవరం, దావాజీగూడెం, బుద్దవరం, అజ్జంపూడి, కేసరపల్లి, జక్కులనెక్కలం గ్రామాల్లో జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం



క్రీడాకారులను అభినందిస్తున్న నవయుగ సంస్థ ప్రతినిధులు

కంకిపాడు: ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరమని నవయుగ సేవా సంస్థ చైర్మన్ యార్లగడ్డ బుల్లియ్య, కార్యదర్శి ఉయ్యూరు శివరావు అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను శనివారం సత్కరించారు. క్రీడాకారుల సంక్షేమం కోసం రూ. 5 వేలు ప్రోత్సాహక బహుమతి అందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఒక్కొక్కరికి రూ. 300 చొప్పున ప్రోత్సాహం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిభావంతులకు సరైన ప్రోత్సాహం ఉంటే ఎంచుకున్న రంగాల్లో రాణిస్తారన్నారు. విద్యార్థులు, క్రీడాకారుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. అరుణకుమారి, ఎస్ఎంసీ చైర్మన్ పి. నాగమణి, స్టాఫ్ సెక్రటరీ పి.సురేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు వీరంకి రమేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఐపై విద్యార్థులు దృష్టి సారించాలి



గంగూరులో ఏఐపై ముగిసిన శిక్షణలో ఫిమేల్ రోబోతో పాల్గొన్న విద్యార్థులు

పెనమలూరు: ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)పై ఇంజినీరింగ్ విద్యార్థులు దృష్టి సారించాలని టీఎల్‌సీ గ్రూప్ హెడ్ ఆపరేషన్స్ పి. సురేంద్రబాబు అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గత ఐదు రోజులుగా జరిగిన ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్‌పై శనివారం శిక్షణ తరగతుల ముగింపులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏఐ, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్, పైథాన్ వంటి అడ్వాన్స్‌డ్ అంశాలపై విద్యార్థులు నైపుణ్యం సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆటమ్ పేరుతో రూపొందించిన ఫిమేల్ రోబో పని తీరును విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి, ప్రొఫెసర్లు డాక్టర్ రావి సత్యప్రసాద్, డాక్టర్ ఎం.వంశీకృష్ణ, డాక్టర్ గోగినేని రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

గన్నవరం: స్థానిక వీఎస్. సెయింట్ జాన్స్ మాధ్యమిక పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో తమ పాఠశాల విద్యార్థులు డి. నాగప్రియూష(అండర్-17), వి. జన్ని ప్రజక్త(అండర్-14) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 20 నుంచి 25వ తేది వరకు నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇరువురు విద్యార్థినులు కృష్ణాజిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ బ్రదర్లు జిమ్మి కురియోకోస్, భల్లా జోసఫ్, జయబాలన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తుందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం వేలేరులో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు నుంచి సుమారు రూ. కోటి వ్యయంతో చేపట్టిన రహదారుల పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. వేలేరు హైస్కూల్ రోడ్డును కూడా మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు మంజూరుకు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుపుతానని పేర్కొన్నారు. జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల గోపాలకృష్ణారావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరు సాయి కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

లారీలను అడ్డుకున్న ముస్తాబాద రైల్వే కాలనీవాసులు



లారీల రాకపోకలను అడ్డుకున్న రైల్వే కాలనీవాసులు

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద రైల్వే కాలనీవాసులు శనివారం లారీలను అడ్డుకుని నిలిపివేశారు. ఈ కాలనీలో 70కుటుంబాలు నివాసం ఉంటుండగా, వారి రాకపోకలకు ఏకైక మార్గం సావరగూడెం గ్రామం వైపు ఉన్న రెండు చెరువుల మధ్య ఉన్న రహదారి మాత్రమే. ఇటీవల వరదలకు పది రోజుల పాటు పూర్తిగా నీట మునిగిన ఈ రహదారి గోతులు, గుంతలతో దెబ్బతిన్నది. గడిచిన వారం రోజులుగా ఈ రహదారిపై డంపర్ లారీలు రబ్బీషు తోలకాలు చేస్తుండటంతో రోడ్డు మరింత దెబ్బతింటూ వస్తోందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తూ రాకపోకలను అడ్డుకున్నారు. ముందుగా రోడ్డుపై గుంతలు పూడ్చాలని డిమాండ్ చేశారు. కాలనీవాసుల రాకపోకలకు ఉన్న ఒకే ఒక రోడ్డు మార్గాన్ని డంపర్ లారీల నుంచి రక్షించాలని, ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముస్లిం మైనార్టీలను ఆదుకోవాలి

కంకిపాడు: ముస్లిం మైనార్టీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చిన్నా మాట్లాడుతూ హజ్ యాత్ర, ఉర్దూ కమిటీ అకాడమీ, ఫైనాన్స్ కార్పొరేషన్‌లకు రాష్ట్ర కమిటీలతో పాటు జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీలు లేకపోవడంతో ముస్లిం మైనార్టీ వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం అందని ద్రాక్షగా మారిందన్నారు. ఆయా కమిటీలకు రాష్ట్ర కమిటీలతో పాటుగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి 'మ్యాథ్స్ బీ'కి విశేష స్పందన



పోరంకి సంవేద విద్యాపీఠ్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



గూడవల్లి కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పెనమలూరు: సాక్షి మీడియా గ్రూప్ శనివారం నిర్వహించిన స్పెల్ మ్యాథ్స్ బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. మండల పరిధిలో శ్రీ ఉషోదయ పాఠశాలలో 22 మంది విద్యార్థులు, సంవేద విద్యాపీఠ్ పాఠశాలలో 69 మంది, గంగూరు నలంద పాఠశాలలో 14 మంది విద్యార్థులు మ్యాథ్స్ పరీక్ష రాశారు. విద్యార్థులు పరీక్షకు ఉత్సాహంగా హాజరయ్యారు. నలంద ప్రిన్సిపాల్ పి. నాగలక్ష్మి మాట్లాడుతూ స్పెల్ బీ వంటి పరీక్షలు విద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. సబ్జెక్టుపై విద్యార్థులు పట్టుసాధించగలుగుతారని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విద్యార్థులను గణితంలో ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దేందుకు విజయవాడరూరల్ మండలం గూడవల్లిలోని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం 'సాక్షి మీడియా' ఆధ్వర్యంలో మ్యాథ్స్ బీ పరీక్ష నిర్వహించారు. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ వ్యవహరించిన ఈ పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. కేటగిరి-2 విభాగంలో 3, 4 తరగతుల విద్యార్థులు 10 మంది, కేటగిరి-3 విభాగంలో 5,6,7 తరగతుల విద్యార్థులు 163 మంది, కేటగిరి-4 విభాగంలో 8,9,10వ తరగతుల విద్యార్థులు 236 మంది పరీక్ష రాశారు. ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నవంబర్ 17న జిల్లా స్థాయిలో పరీక్షలు నిర్వహించనున్నారు.

ఆత్మవిశ్వాసం పెంచింది



సాక్షి మీడియా ద్వారా నిర్వహించిన స్పెల్ బీ పరీక్ష ఆత్మవిశ్వాసం పెంచింది. మ్యాథ్స్ బీ పరీక్ష భవిష్యత్తుకు చక్కని వేదికగా నిలిచింది. ఇటువంటి పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయి.

– కార్తీకవల్లి, 7వ తరగతి, పోరంకి

ప్రతిభకు మంచి అవకాశం



స్పెల్ బీ పరీక్ష ప్రతిభను చూపడానికి మంచి అవకాశం. పాఠశాలలో సాధారణ పరీక్షలు మినహా ప్రతిభను వెలికి తీసే పరీక్షలు ఉండవు. స్పెల్ బీ ప్రతిభను నిరూపించుకోవడానికి దోహదపడుతుంది.

– డి.గౌతమ్, 9వ తరగతి, పోరంకి

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



గన్నవరం: ఓ కిరాణా షాపు యాజమానిని మోసగించి ప్రచారి సరుకులతో ఉడాయించేందుకు ప్రయత్నించిన దొంగను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని కుసుమ హరనాథ ట్రేడర్స్‌కు ఈనెల 10వ తేదీన తణుకు సమీపంలోని పైడిమర్రుకు చెందిన ఇమ్మంది జ్యోతిశివశ్రీ డాక్టర్‌గా దుకాణదారుడితో పరిచయం చేసుకున్నారు. సుమారు రూ. 15 వేలు విలువైన సరుకులను ఆర్డర్ చేశాడు. సదరు సరుకులను శ్రీనగర్‌కాలనీకి డెలివరీ చేయాలని చెప్పారు. అనంతరం సరుకులకు డబ్బులు ఇవ్వకుండా బలవంతంగా లాక్కుని వెళ్లిపోయాడు. దుకాణదారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు అతనిని పట్టుకుని సరుకులను రికవరీ చేశారు. నేరానికి ఉపయోగించిన కారును కూడా సీజ్ చేశారు. సదరు నిందితుడు డాక్టర్‌గా చెప్పుకుంటూ ప్రచారి సరుకులు, ఫోన్లు ఆర్డర్ చేసి డబ్బులు చెల్లించకుండా అపహరించుకుపోయే వాడని సీఐ బీవీ శివప్రసాద్ తెలిపారు. ఇతనిపై ఏపీ, తెలంగాణలో 20 వరకూ కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు.

మూలకణజాల మార్పిడిపై సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్ ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు

గన్నవరం రూరల్: మండలంలోని డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పాథాలజీ డిపార్టుమెంట్‌లో శనివారం ఇండియన్ సొసైటీ ఆఫ్ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యాన రక్తం, మూలకణజాల మార్పిడిపై రెండు రోజులపాటు జరిగే సెమినార్‌ను సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తృత పరిశోధనలతో సమాజానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్, క్లినికల్ థెరపీలలో పురోగతి సాధించడమే లక్ష్యంగా అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్, పాథాలజీ హెచ్‌వోడీ డాక్టర్ నవీన్ చంద్ర, పలు కళాశాలల నిపుణులు పాల్గొని సెమినార్‌లో సందేశమిచ్చారు.

ప్రమాదకరంగా రాకపోకలు



రైల్వే అండర్ పాస్‌లో నిల్చిన వర్షం నీళ్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురం, కోడూరుపాడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ పాస్‌లు కొద్దిపాటి వర్షానికే జలమయం అవుతున్నాయి. వర్షపు నీటిని బయటకు తొలగించేందుకు సరైన ఏర్పాటు చేయకపోవడంతో రోజుల తరబడి అండర్‌పాస్‌లో నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో ఆయా గ్రామస్తులు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోజుల తరబడి వర్షపు నీళ్లు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు జారిపడి తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో అండర్‌పాస్‌ల్లోని నీళ్లు గుర్తించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంపాపురం, కోడూరుపాడు గ్రామాల మీదుగా ఈ అండర్‌పాస్‌ల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఏడాది రైల్వే గేటు పూర్తిగా మూసి వేసి అండర్‌పాస్‌లను ఏర్పాటు చేయడంతో ఈ మార్గం మినహా మరో గత్యంతరం లేకపోవడంతో ఆయా గ్రామస్తులు పలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులకు దీనిపై పలుమార్లు గ్రామస్తులు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పోరంకి చేపలకుండీల సమీపంలో లంకె రాజీ కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె పోరంకి పచ్చళ్ల కంపెనీలో పని చేస్తుంది. రాజీ పనికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ గంగూరు వద్ద జాతీయ రహదారి దాటుతుండగా పెనమలూరు నుంచి కంకిపాడు వైపునకు వెళుతున్న బైక్ ఆమెను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమెకు గాయాలు అవ్వడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు

కంకిపాడు: ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ పి.అనూష సూచించారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ నమోదు క్యాంపులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 22, 23 తేదీల్లో ఈడుపుగల్లు సచివాలయం-2 పరిధిలోనూ, మంతెన, గొడవర్రు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 24, 25 తేదీల్లో వేల్పూరు, కోలవెన్ను, దావులూరు సచివాలయాల్లో శిబిరాలు సాగుతాయన్నారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆధార్ ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.